సంగారెడ్డి మండలంలోని హనుమాన్ నగర్ గ్రామంలో పత్తి విత్తనాలు వేస్తున్న మహిళా రైతులు

నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 25 జూన్ 2024 | SANGAREDDY

పంట రుణ పరిమితి పెరిగేనా !

సంగారెడ్డి, జూన్ 24(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో ఏటా పంటసాగు పెట్టుబడి పెరుగుతూనే ఉన్నది. దుక్కులు దున్నటం మొదలుకుని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు, కూలీల ధరలు, పంటనూర్పిళ్ల ధరలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో రైతులుపై పెట్టుబడి భారం ఏటా పెరుగుతున్నది. రైతులు పంటరుణాల కోసం బ్యాంకర్ల వైపు చూస్తున్నారు. బ్యాంకర్లు మాత్రం పెరిగిన సాగు పెట్టుబడులకు అనుగుణంగా రుణ పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) పెంచడం లేదు. దీంతో రైతులకు పెట్టుబడి తిప్పలు తప్పడం లేదు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా ప్రతి ఎకరాకు ఇచ్చే పంటరుణం సరిపోకపోవటంతో రైతులపై ఆర్థిక భారం పడుతున్నది. సంగారెడ్డి జిల్లాలో వానకాలం సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగును ప్రారంభించారు. దుక్కులు దున్నటం, విత్తనాలు విత్తుకోవడం, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. వానకాలం సీజన్ 7.24 లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో వానకాలం సాగు వేగంగా సాగుతోంది. రైతులు పంటల సాగు ప్రారంభించినా బ్యాంకర్లు ఇప్పటి వరకు పంటరుణాలు ఇవ్వడం ప్రారంభించ లేదు. దీనికి తోడు 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ(ఎస్ఎల్‌టీసీ) ఖరారు చేసిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్(పంటరుణ పరిమితి)పై రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఏమాత్రం పెరగక పోవడమే ఇందుకు కారణం.

రైతులకు ఆర్థిక ఇబ్బందులకు..

బ్యాంకర్లు రైతులకు ఎకరాకు ఎంత మేర పంటరుణాలు ఇవ్వాలి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) అనేది స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ(ఎస్ఎల్‌టీసీ) ఖరారు చేస్తుంది. ఎస్ఎల్‌టీసీలో నాబార్డు, ప్రధాన బ్యాంకర్లు, స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు ప్రతినిధులు ఉంటారు. పంటల సాగుకు మొదలు పంట చేతికి వచ్చేవరకు పంటల వారీగా రైతుకు వచ్చే ఖర్చును అంచనా వేసి ఎస్ఎల్‌టీసీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎస్ఎల్‌టీసీ ఏప్రిల్‌లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్(పంట రుణ పరిమితి) ప్రకటించింది. రుణ పరిమితిని ఎస్ఎల్‌టీసీ ప్రధాన పంటలపై ఏమాత్రం పెంచలేదు. ఉద్యానవన పంటలపై సైతం చాలా వరకు రుణ పరిమితి పెంచలేదు. దీంతో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచకపోవడంపై రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ఎస్ఎల్‌టీసీ ఖరారు చేసిన రుణ పరిమితికి అనుగుణంగానే జిల్లాలోని బ్యాంకర్లు రైతులకు పంటరుణాలు మంజూరు చేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణ పరిమితి పెంచకపోవడంతో రైతులకు ఎకరాకు తాము ఖర్చుచేసే పెట్టుబడి కంటే తక్కువ మొత్తంలో పంట రుణం వచ్చే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వరి సాగుకు ఎకరాకు రూ.45వేల పంట రుణం ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.45 వేల రుణం ఇవ్వనున్నారు. జొన్న పంటకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.19వేలు రుణం ఇవ్వగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.19వేలు రుణం ఇవ్వనున్నారు. మొక్కజొన్నకు ఎకరాకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.34వేల రుణం ఇవ్వగా, ప్రస్తుతం అంతే మొత్తం ఇవ్వనున్నారు. కంది పంటపై గత ఆర్థిక సంవత్సరంలో రూ.21వేల రుణం అందజేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో అంతే మొత్తం రుణం బ్యాంకర్లు ఇవ్వనున్నారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా రైతులు సాగు చేసే పత్తిపంటపైనా బ్యాంకర్లు రుణ పరిమితి పెంచలేదు. గత ఏడాది రూ.45వేలు రుణం ఇవ్వగా ఈ ఆర్థిక సంవత్సరంలో పత్తికి ఎకరాకు రూ.46వేల రుణం ఇవ్వనున్నారు. జిల్లాలో రైతులు ఎక్కువగా సాగుచేసే పత్తి, వరి, కంది, మొక్కజొన్న, జొన్న పంటల సాగుకు పెట్టుబడి ఏటా గణనీయంగా పెరుగుతున్నది. ప్రస్తుతం పత్తి పంట సాగుకు ఎకరాకు రూ.50 నుంచి రూ.55 వేల వరకు పెట్టుబడి అవుతున్నది. బ్యాంకర్ల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మాత్రం రూ.46 వేలు ఉంది. ఎకరం వరి సాగుకు రైతులకు రూ.50 వేల వరకు ఖర్చు అవుతున్నది. బ్యాంకర్లు వరిపై ప్రకటించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ.45 వేలు ఉంది. ప్రతి పంటపై బ్యాంకర్లు ప్రకటించి రుణ పరిమితి తక్కువగా ఉంది. దీంతో రైతులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అనుగుణంగా దక్కని రుణాలు

సంగారెడ్డి జిల్లాలోని బ్యాంకర్లు రైతులకు వంద శాతం పంట రుణాలు ఇవ్వడంలో విఫలం అవుతున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా రుణాలు ఇవ్వడం లేదు. దీనికితోడు వార్షిక రుణ ప్రణాళికలో ఖరారు చేస్తున్న లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడం లేదు. దీంతో రైతులపై ఆర్థిక భారం పెరిగి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా 31 మంది బ్యాంకర్లు రైతులకు పంటరుణాలు ఇస్తున్నారు. ఏటా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అనుగుణంగా రుణాలు ఇవ్వాల్సి ఉండగా, ప్రతిపంటపై రూ.5వేలు తగ్గించి రుణాలు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికితోడు పంటబీమా డబ్బులను సైతం పంటరుణంలోనే మినహాయించుకుంటున్నారు. దీంతో రైతుల చేతికి అంతంతమాత్రంగానే డబ్బులు వస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2725 పంటరుణాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.2505 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.3328 కోట్ల పంటరుణాలు ఇవ్వాలని బ్యాంకర్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలుస్తుంది. ఈసారైనా వందశాతం పంటరుణాలను బ్యాంకర్లు ఇస్తారో లేదో వేచి చూడాల్సిందే.

- ఏటా పెరుగుతున్న సాగు పెట్టుబడులు
- అంతంత మాత్రంగానే రుణ పరిమితి
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచని బ్యాంకర్లు
- సంగారెడ్డి జిల్లాలో వందశాతం లక్ష్యం చేరని రుణాల పంపిణీ
- పంట రుణాలపై అన్నదాతల్లో ఆందోళన
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

సంగారెడ్డి జిల్లాలో వానకాలం 2024-25 సీజన్‌లో ప్రధాన పంటల సాగు అంచనా..

పంటపేరు	సాగు(ఎకరాల్లో)
పత్తి	3,60,000
వరి	1,50,000
కంది	79500
చెరుకు	25000
మొక్కజొన్న	14200
పెసర	9800
మినుము	6300
సోయాబీన్	77600

2024-25 ఆర్థిక సంవత్సరానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎకరాకు కనిష్టం నుంచి గరిష్టంగా ఇచ్చే పంటరుణం

పంట పేరు	2023-24	2024-25
వరి	42000-45000	43000-45000
పత్తి	42000-45000	44000-46000
మినుము	15000-17000	15000-17000
పెసర	16000-18000	16000-18000
జొన్న	17000-19000	17000-19000
మొక్కజొన్న	26000-28000	26000-28000
కంది	18000-21000	19000-21000
సోయాబీన్	26000-28000	28000-30000
చెరుకు	62000-64000	64000-66000

29న జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం

సంగారెడ్డి జూన్ 24(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం ఈనెల 29న జరగనున్నది. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ సమావేశం జరగనున్నది. సమావేశానికి మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఎమ్మెల్యేలు, నూతనంగా ఎన్నికైన ఎంపీలు హాజరుకానున్నారు. జడ్పీ సమావేశానికి సంబంధించిన ఎజెండాను అధికారులు సిద్ధం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో నిధుల కొరతతో అభివృద్ధి పనులు సాగటం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పనులు సైతం నిలిచిపోయాయి. గ్రామాల్లో పారిశుధ్యం, రహదారులు, కరెంటు సమస్యలపై సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తే అవకాశం ఉంది. జిల్లా పరిషత్ పాలక మండలి పాలన సమయం జూలై 5తో ముగియనుంది. దీంతో 29న నిర్వహించే సమావేశం చిట్టచివరి సమావేశం కానుంది. జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికలు 2019లో మూడు విడతలుగా జరిగాయి. 27 మే, 2019న జడ్పీటీసీలు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. 5 జూలై, 2019న జడ్పీచైర్‌పర్సన్‌గా మంజుశ్రీజైపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయగా నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీలు ప్రమాణస్వీకారం చేశారు. వచ్చేనెల 4వ తేదీతో జడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. 29న జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి సభ్యులు తీర్మానాలు ఆమోదించే అవకాశాలు ఉన్నాయి.

అంతర్జాతీయ గుర్తింపు దిశగా మంజీరా అభయారణ్యం

- సంగారెడ్డి జిల్లాకు అరుదైన గౌరవం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

మంజీరా అభయారణ్యం కేంద్రంలో పక్షు జాతులను లెన్స్ ద్వారా వీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24: మంజీరా వన్యప్రాణుల అభయారణ్య కేంద్రానికి అంతర్జాతీయ గుర్తింపు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం మంజీరా వన్యప్రాణుల కేంద్రాన్ని ఈఎఫ్ఎస్ అండ్ టీ జాయింట్ సెక్రెటరీ వాణీప్రసాద్ ఐఏఎస్, డీఎఫ్‌వో శ్రీధర్‌రావు, ఈటీఆర్ఐ శాస్త్రవేత్తలు, పక్షుల పరిశీలకులు, మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చూరీ బృందంతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజీరా నుంచి సింగూరు డ్యామ్ వరకు మంజీరా నదిలో మొత్తం 20 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్నదని తెలిపారు. ఇక్కడ 9 ద్వీపాలు ఉన్నాయని, వాటిని పడవల్లో తప్ప, ఇతర మార్గాల ద్వారా చేరుకోలేమన్నారు. అభయారణ్యం సరిహద్దు నుంచి 1000 మీటర్ల వరకు ఎకోసెన్సిటీవ్ జోన్‌గా గుర్తించామన్నారు. మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చూరీలో జీవవైవిధ్యం ఉండడంతో రాంసర్ సైట్‌గా ప్రకటించే అవకాశం ఉన్నదన్నారు. దాదాపు 303 రకాల పక్షులు ఉండగా, వాటిలో 117 కంటే ఎక్కువ జాతులు వలస పక్షులని పేర్కొన్నారు. 14 జాతుల ఉభయచరాలు, 57 జాతుల చేపలు, 32 రకాల సీతాకోక చిలకలు, 25 అకశేరుకాలు, 28 ఆర్కిడ్‌లు, 28 ఓడోనేట్స్, 31 రకాల సరిసృపాలు ఈ అభయారణ్యంలో నివసిస్తాయని వివరించారు. ఇది రాంసర్ కింద జాబితా చేసేందుకు కచ్చితంగా అర్హత పొందుతుందని కలెక్టర్ పర్యటన బృందానికి వివరించారు. ఈ అభయారణ్యంలో లభ్యమయ్యే జంతుజాలం వైవిధ్యాన్ని జిల్లా అటవీశాఖ అధికారులు వివరించారు. సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోతల కరెంట్‌తో పని జరగడం లేదు !

దుబ్బాక, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ తీస్తున్నారు. దీంతో కార్పెంటర్ పని కొనసాగడం లేదు. ప్రస్తుతం మా కులవృత్తి వడ్రంగి పని కరెంట్‌పైనే ఆధారపడి ఉంటుంది. కోతల కరెంట్‌తో పని చేసేందుకు పలు ఇబ్బందులు పడుతున్నాం. ఒప్పుకున్న పని సకాలంలో చేసి ఇవ్వలేకపోతున్నాం. ఎప్పుడు కరెంట్ పోతుందో...ఎప్పుడు వస్తుందో తెలువని పరిస్థితి నెలకొంది. ఓ పక్క వర్షాలు లేక మరో పక్క కోతల కరెంట్‌తో సమస్యగా మారింది. కేసీఆర్ సర్కారులో గ్రామాల్లో నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగింది. అన్ని వర్గాలూ సంతోషంగా పనులు చేసుకున్నారు.

- వడ్ల పరశురాములు, కార్పెంటర్, దుబ్బాక

కేసీఆర్‌ను ప్రశ్నించడం సరికాదు..

నాగల్‌గిద్ద, జూన్ 24: కరెంట్ కష్టాలు తీర్చి రైతులకు ఎంతో మేలు చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 3 గంటల కరెంటు కూడా వచ్చేది కాదు.ఉండేది. మళ్లీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత 2014 ముందు పరిస్థితులు మొదలయ్యాయి. కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చి రైతుల బాధలను దూరం చేశారు. సీమాంధ్ర పాలనలో రాత్రి వేళల్లో బోర్ల వద్ద పడుకొని పాముకాటుకు ఎంతోమంది రైతులు చనిపోయారు. రోడ్లెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసేటోళ్లం. కేసీఆర్ సీఎం అయ్యాక కంటి నిండా నిద్రపోయాం. కరెంటు విషయంలో కేసీఆర్‌ను నిలదీయడం సరికాదు.కాంగ్రెసోళ్లు మంచిగా కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

- భీమాణ్ణా, రైతు, ఉట్‌పల్లి

కేసీఆర్‌కు సాధ్యమైంది..కాంగ్రెసోళ్లకు ఎందుకు కాదు..

చిలిపిచెడ్, జూన్ 24: ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఇబ్బందులు ఎలా ఉండేవో.. అలాంటి పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తీసుకొచ్చింది. పదేండ్లు కేసీఆర్‌కు సాధ్యమైంది..కాంగ్రెసోళ్లకు ఎందుకు సాధ్యం కావడం లేదు. నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెసోళ్ల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామని వట్టి మాటలు చెబుతున్నారు. రాత్రి వేళల్లో గంటల తరబడి కరెంటు లేక ఇబ్బంది పడుతున్నాం. చిన్నపాటి వర్షం కురిసిన, గాలి వీచినా కరెంటు కట్ చేస్తున్నారు. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వర్షం సాకుతో గంటల తరబడి కరెంటు తీసేస్తున్నారు. కేసీఆర్ హయాంలో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా ఉండేది. ఛత్తీస్‌గడ్ నుంచి కరెంటు తీసుకురావంపై కాంగ్రెసోళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. అప్పటి పరిస్థితుల్లో రైతులను రక్షించుకోవడానికి, పరిశ్రమలను కాపాడుకోవడానికి కరెంటు కొన్నారు. లేకపోతే ఇండ్లకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఇబ్బందులు వచ్చేవి.

-గడ్డం నరేందర్‌రెడ్డి, రైతు, చండూర్

కార్మికులకు కరెంట్ తిప్పలు తప్పవా..?

గుమ్మడిదల, జూన్ 24: గతంలో కంపెనీల్లో వారంలో రెండు రోజులు, నెలకు పది రోజులు పవర్‌హాలిడేలు ఇచ్చారు. దీంతో జీతం తక్కువ రావడం వల్ల కుటుంబాన్ని పోషించడానికి కార్మికులం ఇబ్బందులు పడ్డాం. ఈ బాధలు చూసిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక కంపెనీలకు నిరంతరంగా కరెంట్ ఇచ్చి కార్మిక లోకాన్ని కాపాడిండు. కంపెనీలు పవర్ హాలిడేలకు స్వస్తి చెప్పి ఉత్పత్తి మీద దృష్టి సారించాయి. రాష్ట్రంలో చాలా పరిశ్రలు రావడంతో లక్షల మంది కార్మికులకు ఉపాధి దొరికింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో బాగానే ఉన్నాం. కాంగ్రెస్ సర్కారు రావడంతోనే కంపెనీల్లో ఎప్పుడు కరెంట్ పోతదో తెలుస్తలేదు. కంపెనీలో జనరేటర్‌తో నడిపించడానికి ఆసక్తి చూపుత లేరు. ఇట్లా కొన్ని రోజులు వస్తే తిరిగి కార్మికులు రోడ్డున పడే దుస్థితి వస్తుంది. ఇట్లా కాకుండా రాష్ట్ర సర్కారు పరిశ్రమలకు కటింగ్‌లేని కరెంట్ సరఫరా చేయాలి. లేదంటే కార్మికులకు కష్టాలు తప్పవు.

- అమ్మన్నగారి శేఖర్, కార్మిక నాయకుడు, బొంతపల్లి, గుమ్మడిదల మండలం

జూనియర్ డాక్టర్ల సమ్మె

- అత్యవసర సేవలు మినహా అన్ని సేవలు బంద్
- సమస్యలు పరిష్కరించాలంటూ సిద్దిపేట దవాఖాన ఎదుట ఆందోళన

సిద్దిపేట ప్రభుత్వం మెడికల్ కళాశాల ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు

సిద్దిపేట, జూన్ 24: ఉపకార వేతనాలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలంటూ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట జూనియర్ డాక్టర్లు సోమవారం సమ్మె చేశారు. అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు ప్రత్యూశ్, పల్లవి మాట్లాడుతూ.. ప్రభుత్వం జూనియర్ డాక్టర్లకు రావాల్సిన ఉపకార వేతనాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపకార వేతనాలు సమయానికి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో అత్యవసర సేవలం దించే ఉస్మానియా దవాఖానకి నూతన భవనం నిర్మించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో చికిత్స కోసం వచ్చే వారికి కనీస సౌకర్యాలు, వసతులు, మందులు సమయానికి అందించాలని డిమాండ్ చేశారు. సౌకర్యాలు లేక కొన్ని సమయాల్లో సరిగా చికిత్స అందకపోవడం వల్ల పేషంట్ల బంధువులు జూనియర్ డాక్టర్లపై దాడులకు దిగుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. డాక్టర్లకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారికి లైబ్రరీలు, హాస్టల్ వసతి, తాగునీరు, డాక్టర్ గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

హుస్నాబాద్ మెగా జాబ్ మేళాలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యోగం పొందిన యువతి శ్రీకావ్యకు ఆఫర్ లెటర్ అందజేస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, జూన్ 24: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరితో కలిసి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు కంపెనీలతో మాట్లాడి ఆయా కంపెనీల్లో కావాల్సిన ఉద్యోగాల భర్తీకి గ్రామీణ నిరుద్యోగ యువతను ఎంపిక చేసుకోవాలని కోరినట్లు చెప్పారు. అందులోభాగంగానే హుస్నాబాద్‌లో జరుగుతున్న జాబ్ మేళాకు 60కిపైగా కంపెనీలు వచ్చాయన్నారు. సుమారు 6వేల మంది యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరు కాకుండా మరో రెండు వేల మంది వరకు మేళాకు హాజరయ్యారని తెలిపారు. జీరో టు పీజీ వరకు చదువుకున్న వారందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగం దొరుకుతుందన్నారు. విదేశాల్లో కూడా ఉద్యోగం సంపాదించే అవకాశం ఉన్నందున నిరుద్యోగులు ఓపికతో ఉండి ఆయా కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. త్వరలోనే మండలాల వారీగా కూడా జాబ్ మేళాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి అక్కడి ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా మారుస్తామని, దీంతో కూడా కొంతమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట ఇన్ని కంపెనీలు రావడం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితా రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి వచ్చిన యువతీ యువకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన..

హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. జాబ్ మేళాలో 5,225మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి లభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మొత్తం 8,795మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఇందులో 1,310మంది యువతీయువకులకు అక్కడిక్కడే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 3,887మంది షార్ట్ లిస్టును వివిధ కంపెనీలు తయారు చేశాయని, వీరందరినీ త్వరలోనే ఆయా కంపెనీలకు పిలిపించి ఇంటర్వ్యూలు, స్కిల్స్ నేర్పించి ఉద్యోగం ఇస్తారని చెప్పారు. జాబ్‌మేళా నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, ప్రజా ప్రతినిధులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

చిన్నారిపై లైంగికదాడి

రాయపోల్, జూన్ 24: అభం శుభం తెలియని చిన్నారిపై లైంగికదాడి జరిగిన ఘటన దౌల్తాబాద్ మండలంలో చోటు చేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన బాలుడు (16) ఇంటి ముందు ఉండే చిన్నారి (5)ని రోజూ ఎత్తుకొని ఆడిస్తుండేవాడు. చిన్నారి వీళ్ల ఇంటికెళ్లి ఆడుతూ పాడుతూ రోజూ తిరుగుతుండేది. ఆదివారం సాయత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిన్నారిపై బాలుడు లైంగికదాడికి పాల్పడుతుండగా గమనించిన చిన్నారి బంధువులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి అక్కడి నుంచి పరారయ్యాడు అనంతరం చిన్నారి తండ్రి దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు.

కూతురును కాపాడబోయి..

బావిలో దూకి తండ్రి, కూతురు మృతి

గజ్వేల్, జూన్ 24: మనస్తాపంలో వ్యవసాయ బావిలో దూకిన కూతురును కాపాడబోయిన తండ్రి, కూతురు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని మక్తమాసాన్‌పల్లి గ్రామ మధిర గ్రామం కాశగుడిసెలలో చేటు చేసుకుంది. ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిరాజ్ ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా భర్తను ఎందుకు మద్యానికి బానిసయ్యావని సంసారం నాశనం చేస్తున్నావని అడిగింది. దీంతో భార్యాభర్తల మధ్య మాటమాట పెరిగి గొడవ పడుతుండగా అతడి చిన్న కూతురు రేష్మ ఎప్పుడు తాగొచ్చి ఇంట్లో గొడవ చేస్తుంటావని తండ్రిని అడిగింది. నీవేంది నాకు ఎదురు చెప్పుతావని తండ్రి కూతురుని మందలించడంతో కూతురు రేష్మ(16) మనస్తాపంతో ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో దూకింది. దీంతో కూతురును కాపాడుతానని తండ్రి సిరాజ్(46) బావిలో దూకిండు. తండ్రి సిరాజ్‌కు ఈత రాకపోవడంతో ఇద్దరూ నీటిలో మునిగి మృతి చెందారు. దీంతో గ్రామస్తుల సాయంలో మృతదేహాలను వెలికితీశారు. మృతు డి భార్య జరినా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జోగినాథ్ గుప్తా

రైల్వేలైన్‌కు కదలిక

రైల్వే సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్ గుప్తా

అందోల్, జూన్ 24: వట్టి నాగులపల్లి– సంగారెడ్డి, జోగిపేట, మెదక్ రైల్వేలైన్‌తోపాటు వట్టి నాగులపల్లి– సంగారెడ్డి, జోగిపేట, నారాయణఖేడ్ మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుపై కదలిక ప్రారంభమైందని రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేలైన్ కోసం దక్షిణమధ్య రైల్వే జీఎం శ్రీధర్ తోపాటు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిశామన్నారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. 15 సంవత్సరాలుగా రైల్వేలైన్ కోసం సంబంధిత శాఖ మంత్రులు, అధికారులను కలుస్తున్నామని, ఇన్నాళ్లకు చేసిన కృషి ఫలించబోతుందన్నారు. గతంలో ఒకసారి ఈ రైల్వేలైన్ కోసం సర్వే పూర్తి చేశారని, ఇప్పుడూ మరోసారి సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారన్నారు. ఈ సందర్భంగా ఎంపీతోపాటు సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపార